నేడు గుట్టలో మినీశిల్పారామం ప్రారంభం

- ఇది కేసీఆర్ కట్టించిందే

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం సమీపంలో మినీ శిల్పారామం లోపలికి వెళ్లే దారి

- రూ. 2 కోట్ల వ్యయంతో కట్టించిన కేసీఆర్
- రిబ్బన్ కట్ చేయనున్న మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డి

యాదాద్రిభువనగిరి, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : ప్రపంచం అబ్బురపడే అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రం.. ఔరా అనిపించే శిల్పకళా సౌందర్యం.. సాక్షాత్తు భూలోక వైకుంఠం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం.. దీని రూపకర్త, నిర్మాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. భక్తులకు ఆధ్యాత్మిక వైభవమే కాకుండా ఆహ్లాదభరిత కట్టడాలకు కూడా శ్రీకారంచుట్టారు. యాదగిరిగుట్ట పరిధిలో కేసీఆర్ హయాంలోనే నిర్మించిన మినీ శిల్పారామం మరో మణిహారంగా మారనున్నది. రాయగిరి చెరువు వద్ద రెండు ఎకరాల్లో రూ. 2 కోట్ల వ్యయంతో మినీ శిల్పారామం ఏర్పాటుచేశారు. భక్తులు సేదతీరేలా పార్కులు, గ్రీనరీ, చిన్న పిల్లల ఆటల ప్రాంగణం, కుటీరాల సదుపాయం కల్పించారు. వాటర్ బెడ్స్, ఫౌంటెయిన్లు, బోటింగ్, వ్యూపాయింట్, ఫుడ్‌కోర్టు, లాన్ తదితర వసతులు కనువిందు చేస్తున్నాయి. రాత్రి వేళ లైటింగ్ ఏర్పాటు చేశారు. చేనేత, హస్తకళల స్టాళ్లు, సాండ్ స్టోన్ శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. వీటిని కేసీఆర్ కట్టించడంతో వెంటనే ప్రారంభించడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి మనసు రాలేదు. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావడంతో ఏడాదిన్నర తర్వాత ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు.

- ఇది కేసీఆర్ కట్టించిందే



యాదగిరిగుట్ట సమీపంలోని మినీ శిల్పారామంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ నుంచి విరజిమ్ముతున్న నీటి ధారలు

సుదీర్ఘస్వప్నం.. సాకారమైన సుదినం

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి నేటితో 11 సంవత్సరాలు పూర్తి
- స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ 14 ఏండ్లపాటు సుదీర్ఘ ఉద్యమం
- నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపజేసిన ఆమరణ దీక్ష
- 36 రాజకీయ పార్టీలతో తెలంగాణకు జై కొట్టించిన కేసీఆర్
- విధిలేని పరిస్థితుల్లో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టిన కాంగ్రెస్
- పాలకుడిగా తెలంగాణ రాష్ట్రంపై కేసీఆర్ 10 ఏండ్ల ప్రగతి సంతకం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఆరున్నర దశాబ్దాల 'తెలంగాణ రాష్ట్ర' ఆరాటాన్ని పోరాటంగా మలిచి, స్వరాష్ట్రాన్ని కండ్ల ముందు నిలిపిన సుదినం 2014, జూన్ 2. దానిని సాకారం చేసిన పోరాటయోధుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలిపారు. దేశంలో తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించి పదకొండేండ్లు పూర్తి చేసుకున్నది. స్వరాష్ట్రం కోసం 1952 నుంచి 1969 దాకా, 1969 నుంచి 2001 దాకా, 2001 నుంచి 2014 దాకా తెలంగాణ దశలవారీగా అలుపెరుగని పోరాటం చేసింది. దశాబ్దాలుగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అణచివేతలపై ఎన్ని పోరాటాలు సాగినా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో 2001 ఏప్రిల్ 27వ తేదీన గులాబీ జెండా ఎగిరినప్పటి నుంచి సుదీర్ఘ కాలం సాగిన ఉద్యమం మాత్రమే గమ్యాన్ని ముద్దాడింది. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అణచివేతకు గురైంది. మలిదశ ఉద్యమం కేసీఆర్ నాయకత్వంలో 2001లో ప్రారంభమైనా, 2009 తర్వాతే ఉద్యమం కీలక మలుపులు తిరిగి, చివరికి 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించిన విషయం తెలిసిందే.

'ఫ్రీ జోన్'పై తెలంగాణ ఫైర్

తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన అరుదైన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే 2009 అక్టోబర్‌లో పోలీసు ఉద్యోగాలకు హైదరాబాద్‌లో లోకల్ రిజర్వేషన్లు ఎత్తివేసి 'ఫ్రీ జోన్'గా ప్రకటించడంతో ఉద్యమం పతాక స్థాయికి చేరింది. హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా మార్చితే తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాల్లో తెలంగాణ యువత రిజర్వేషన్లు కోల్పోతారని, అది 610జీవోకు విరుద్ధమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారు. అలా తుది దశ ఉద్యమాన్ని సృష్టించింది ఆ ఫ్రీ జోన్ అంశం. ఆ తర్వాత 2009 నవంబర్ 29న 'తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో.. కేసీఆర్ శవయాత్రో..తెలంగాణ జైత్రయాత్రో' అనే నినాదంతో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను తలపెట్టిన సంగతి తెలిసిందే. నాటి సమైక్యపాలకులు కేసీఆర్‌ను

రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా విద్యుత్తు కాంతులీనుతున్న తెలంగాణ భవన్

అరెస్టు చేయడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని చూశారు. సిద్దిపేటలోని రంగధాంపల్లిలో ఆమరణ నిరాహారదీక్షా స్థలికి కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్‌ను అల్గునూర్ చౌరస్తాలో అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. పోలీసులు తనను అరెస్టు చేసిన క్షణం నుంచే ఆరమరణ నిరాహార దీక్షకు దిగుతున్నానని ప్రకటించి, అక్కడి నుంచి ఖమ్మం జైలుకు తరలించినా ఆయన నిరాహార దీక్షను వీడలేదు. కేసీఆర్ దీక్ష నవంబర్ 29వ తేదీ నుంచి 11 రోజులపాటు తెలంగాణ నలుదిక్కులను ఏకం చేసింది. తెలంగాణ సమాజం ఒక్కటై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపజేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి డిసెంబర్ 9న 'రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నాం' అని ప్రకటించాల్సిన అనివార్యతను కేసీఆర్ సృష్టించారు. డిసెంబర్ 23న ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవడంతో ఉద్యమం మళ్లీ పతాకస్థాయికి చేరింది. కేసీఆర్ ఆమరణ దీక్షతో బెంగటిల్లిన శ్రీకాంతాచారి ఆత్మబలిదానంతో మొదలైన ఆత్మహత్యల పరంపర కొనసాగింది. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తాత్సారం చేయటంతో వందలాది మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవటానికి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన పోరాటాలు, పార్టీలకు అతీతంగా ఏర్పడిన జేఏసీలు ఉవ్వెత్తున ఉద్యమించాయి. కేసీఆర్ పర్యవేక్షణ, నాయకత్వంలోని పొలిటికల్ జేఏసీ మిలియన్ మార్చ్, సాగరహారం తదితర మెరుపు ఉద్యమాలు తెలంగాణ చరిత్రను మలుపుతిప్పాయి. మరోవైపు దేశంలోని 36 రాజకీయ పార్టీలతో తెలంగాణకు అనుకూలంగా కేసీఆర్ కేంద్రానికి ఉత్తరాలు తెచ్చి ఇవ్వడంతో విధిలేని పరిస్థితులతో కేంద్రం దిగొచ్చింది. ఫలితంగా 2014 ఫిబ్రవరి 13న లోక్‌సభలో ఏపీ పునర్విభజన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 18న లోక్‌సభలో తెలంగాణ ఏర్పాటు బిల్లుకు ఆమోదం, తర్వాత ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదముద్ర పడింది. 2014 మార్చి 1 రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఫలితంగా జూన్ 2న తెలంగాణకు గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. దీంతో 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది.

దేశానికే దిక్సూచిగా తెలంగాణ

అనేక పోరాటాలతో సాధించిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ నాయకత్వంలో అద్భుతంగా పురోగమించింది. రాష్ట్రం విడిపోతే అంధకారంలో మునిగిపోవడం ఖాయమన్న అనుమానాలను పటాపంచలు చేసింది. పాలన చేతకాదన్న అవహేళనలకు అభివృద్ధితో చెంప పెట్టు లాంటి సమాధానం ఇచ్చింది. బీఆర్ఎస్ రెండు పర్యాయాల పాలనలో తెలంగాణ అద్వితీయ ప్రగతిని సాధించింది. దేశానికే తలమానికంగా నిలిచింది.

స్వయంపాలన స్ఫూర్తి కొనసాగాలి

- ప్రజల్లో ప్రభుత్వం విశ్వాసం నింపాలి
- హామీలు అమలు చేయాలి : కేసీఆర్
- రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత తెలంగాణ ఆవిర్భావ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుతంగా పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. సకలజనుల సంక్షేమాన్ని కొనసాగిస్తూ, సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ, పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుకొన్నామని వివరించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలని సూచించారు. తెలంగాణ మరింత ప్రగతిని సాధిస్తూ, పాడి పంటలతో వర్ధిల్లుతూ, రైతులు, సబ్బండ కులాలు, సకలజనుల జీవితాలు సుఖ సంతోషాలతో నిండాలని ఆదివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు.

అబుదాబిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

అబుదాబిలోని ఇండియా ఎంబసీ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్– అబుదాబి ఆధ్వర్యంలో జయప్రదంగా సాగిన ఈ వేడుక తెలంగాణ గౌరవాన్ని, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పింది. - హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ)

నేడు తెలంగాణ భవన్‌లో అవతరణ వేడుకలు

- జాతీయ జెండాను ఎగురవేయనున్న సిరికొండ
- హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ సీనియర్ నాయకుల రాక
- కాళేశ్వరంపై హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. రాష్ట్రావతరణ వేడుకలకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహముద్ అలీ, ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లను పూర్తిచేశారు. బీఆర్ఎస్ జిల్లా, నియోజకవర్గ కార్యాలయాలతోపాటు పట్టణాలు, మండల కార్యాలయాలు, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాను, పార్టీ జెండాను ఎగురవేసి, పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోనున్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ కల సాకారం

- ఆయన పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దిన శుభాకాంక్షలు

హైదరాబాద్ జూన్ 1 (నమస్తేతెలంగాణ): 'ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను సహించలేక డిప్యూటీ స్పీకర్ పదవిని త్యజించి.. బీఆర్ఎస్ పార్టీని స్థాపించి.. తెలంగాణను సాధించి నాలుగుకోట్ల ప్రజల దశాబ్దాల నాటి కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది' అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉద్ఘాటించారు. మహాత్ముడు చూపిన అహింసామార్గంలో ఆయన రాష్ట్రాన్ని సాధించిపెట్టారని ఆదివారం ఒక ప్రకటనలో కొనియాడారు. ప్రజల మద్దతుతో అధికారం చేపట్టి పదేండ్లలో ఎనలేని అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరుగులు పెట్టించారని పేర్కొన్నారు. ఆయన హయాంలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతోషంగా జీవించారని తెలిపారు. సర్వ హంగులతో సెక్రటేరియట్‌ను నిర్మించి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ పేరు పెట్టారని ప్రశంసించారు. మహానగరం నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తుచేశారు. నేర నియంత్రణకు అధునాతన టెక్నాలజీతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించారని, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా హైదరాబాద్ నగరంలో ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ బ్రిడ్జీలు కట్టించిన గొప్ప పాలనాదక్షుడు కేసీఆర్ అని కొనియాడారు. సుస్థిరమైన పాలన, పటిష్ఠమైన శాంతిభద్రతలు, సరళమైన పారిశ్రామిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలివచ్చాయని తెలిపారు. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఉబర్, ఇన్ఫోసిస్ లాంటి ఎన్నో బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయని పేర్కొన్నారు. పాలనా సౌలభ్యం కోసం 23 కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి సకల హంగులతో కలెక్టరేట్ భవనాలను నిర్మించారని, వైద్య, నర్సింగ్ కళాశాలలను స్థాపించారని గుర్తుచేశారు.

మూడేండ్లలోనే కాళేశ్వరం నిర్మాణం

బృహత్తరమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని మూడేండ్లలోనే నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ దిగ్విజయంగా నిర్మించారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కొనియాడారు. ఏటా సుమారు 2.45 కోట్ల ఎకరాలకు నీరందించి తెలంగాణను సస్యశ్యామలం చేసి అన్నపూర్ణగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన విద్యనందించేందుకు 1,104 గురుకులాలను నిర్మించారని, విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.20 లక్షల చొప్పున అందజేసిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, గీత, నేత, బీడీ కార్మికులకు రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున ఆసరా పింఛన్లు ఇచ్చి అసహాయులను ఆదుకున్నారని తెలిపారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లిండ్లకు రూ.లక్ష చొప్పున సాయం చేశారని తెలిపారు. మాతాశిశు సంరక్షణకు కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, పోషకాహార కిట్లు పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆయన పాలనలోనే తెలంగాణలో సబ్బండ వర్ణాలు సంతోషంగా ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పునర్విభజన బిల్లుకు తానే తొలి ఓటేశా: నామా

తాను ఎంపీగా ఉన్న సమయంలోనే పార్లమెంట్‌లో ఉమ్మడి ఏపీ రాష్ట్ర పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టారని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆనాడు తానే తొలి ఓటు వేశానని ఆయన గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర సాధన కోసం ఆనాడు జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

రేవంత్ పాలనలో తెలంగాణ విధ్వంసం

- అక్రమాలతో దివాలా తీయిస్తున్నారు
- నాడు సీమాంధ్ర పాలనలో తీవ్రదోపిడీ
- కేసీఆర్ కృషితోనే తెలంగాణ సాకారం
- పదేండ్ల పాలనలో రాష్ట్రం సుసంపన్నం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్

హైదరాబాద్ జూన్1 (నమస్తేతెలంగాణ): 'కేసీఆర్ నాడు సీమాంధ్ర పాలకుల దోపిడీని ఎదిరించి.. పదవులను గడ్డిపోచలా త్యజించి.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి.. పదేండ్ల పాలనలో అన్నిరంగాల్లో ముందు నిలిపిన తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి నేడు విధ్వంసం సృష్టిస్తున్నారు' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో విధ్వంసం, విద్వేషాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం, సంపద సృష్టిలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణను నేడు అధోగతి పాలుచేస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ఉపేంద్ర, సుమిత్రా ఆనంద్ తానోబాతో కలిసి ఆదివారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ నాయకులు పదవుల కోసం ఉమ్మడి పాలకుల దోపిడీ విధానాలకు వత్తాసు పలికారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర ఉన్నదని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తన గురువైన చంద్రబాబు కనుసన్నల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడ్డారని విమర్శించారు. ఉమ్మడి పాలనలో ఆంధ్రా పాలకులు తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ అహింసా మార్గంలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని పునరుద్ఘాటించారు. తెచ్చిన తెలంగాణను పదేండ్లు సుసంపన్నం చేశారని తెలిపారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. నేడు రేవంత్ సర్కార్ అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నదని మండిపడ్డారు.

సీఎంకు రైతులను పరామర్శించే తీరికే లేదా?

అందగత్తెలను చూసేందుకు ఐదుసార్లు ఈవెంట్లకు వెళ్లిన సీఎంకు, కష్టాల్లో ఉన్న రైతులను పరామర్శించే తీరికే లేదా అని దాసోజు ప్రశ్నించారు. కల్లాల్లో వడ్లు తడిసి బోరుమంటున్న రైతుల గోసను తీర్చే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు.

కేసీఆర్ దీక్ష.. విద్యార్థుల త్యాగఫలమే తెలంగాణ

ప్రజలకు రాష్ట్రావతరణ శుభాకాంక్షలు: సబిత

బడంగ్‌పేట్, జూన్ 1: నాడు ఉద్యమనేతగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, ఎంతోమంది విద్యార్థుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చు డో' అన్న నినాదంతో తెలంగాణ పోరాటం అగ్నికణంగా ఎగిసి పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సబండ వర్గాలు సమర శంఖారావం పూరించాయని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలో అన్నివర్గాల ప్రజలు ముందుకు సాగి కేంద్రం మెడలు వంచి తెలంగాణను సాధించారని తెలిపారు. వంటావార్పు, సడక్ బంద్, రైల్‌రోకో, మానవహారాలు, ఆమరణ నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, ధూమ్ ధామ్ కళాప్రదర్శనలతో ఆనాడు తెలంగాణ రాష్ట్రమంతా దద్దరిల్లిపోయిందని పేర్కొన్నారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని గుర్తుచేశారు. పదేండ్ల తన పాలనా కాలంలో సీఎంగా కేసీఆర్ అన్నిరంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, బంగారు తెలంగాణ తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం మళ్లీ అధోగతి పాలవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అమరవీరులకు నివాళులు అర్పించాలని సూచించారు. వేడుకల సందర్భంగా జాతీయ జెండాను, బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి సంబురాలు చేసుకోవా లని సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు.